సాక్షి వరంగల్

శుక్రవారం | 22 | డిసెంబర్ | 2023



9.5 కిలోల గంజాయి పట్టివేత

గ్రేటర్ 16వ డివిజన్ ధర్మారంలో పోలీసులు గురువారం 9.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. -8లో▸



హోరాహోరీగా పోటీలు

ఐటీడీఏ జోనల్ క్రీడాపోటీల్లో గిరిజన క్రీడాకారులు దుమ్ములేపుతున్నారు. పోటీల్లో నువ్వా.. నేనా అన్నట్లుగా తలపడుతున్నారు. -8లో▸



వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో చలి ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళ పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోస్టాఫీస్‌లో సేవింగ్ ఖాతా ఓపెన్ చేయాలి



నర్సంపేట/నెక్కొండ: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500కు గ్యాస్, మహిళలకు రూ.2500 ఇవ్వనున్నందున అందరూ పోస్టాఫీస్‌ల్లో సేవింగ్ ఖాతాలు ఓపెన్ చేయాలని జిల్లా తపాలా పర్యవేక్షకుడు ఎస్‌వీఎల్‌ఎన్ రావు తెలిపారు. ఈ మేరకు నర్సంపేట, నెక్కొండ పోస్టాఫీస్‌లలో గురువారం ఆయన మాట్లాడారు. రూ.500తో పీఓఎస్‌బీ ఖాతా తీసుకుంటే ఏటీఎం కార్డు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏటీఎం కార్డు ద్వారా ఏ బ్యాంకు ఏటీంలోనైనా డబ్బులు తీసుకోవచ్చని, ఆన్‌లైన్ లావాదేవీలు కూడా చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆన్‌లైన్ సేవలను ఆయన పరిశీలించారు. నర్సంపేట ఉప తపాలా పోస్ట్ మాస్టర్ డి.రాజేందర్, పీఏ.సురేష్, నెక్కొండ ఉప తపాలా పోస్ట్‌మాస్టర్ మహ్మద్‌తాసీమ్, ఎస్‌డీ తన్వీర్ హైమద్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాల కోసం అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నర్సంపేట సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 18 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు విద్యార్థులు రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2023–24లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురుకుల ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు ప్రీ–లోక్ అదాలత్

వరంగల్ లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం 'ప్రీ–లోక్ అదాలత్' నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్, సివిల్, ప్రీ–లిటిగేషన్, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగాదా, వివాహ/కుటుంబ, వెహికల్ యాక్సిడెంట్, చిట్‌ఫండ్ తదితర రాజీపడే కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ప్రీ–లోక్ అదాలత్‌లో కక్షిదారుల సమయం వృథా కాకుండా, వెంటనే రాజీ కుదుర్చుకునేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, రాజీపడే కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.


మెరుగైన వైద్యానికి శిక్షణ

ఎంజీఎం: వైద్యవిద్యా బోధనను మెరుగుపర్చేందుకు ప్రతీ వైద్య ఉపాధ్యాయుడికి శిక్షణ అవసరమని ఎన్‌ఎంసీ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణవిశ్వనాథ్ వాణికర్ అన్నారు. తెలంగాణలో హైదరాబాద్, బాసర తర్వాత కాకతీయ మెడికల్ కళాశాలకు మంజూరైన రీజినల్ మెడికల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభించేందుకు గురువారం వాణికర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. ఎడ్యుకేషన్ సెంటర్ ప్రాముఖ్యత, సెంటర్ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. నేషనల్ మెడికల్ కమిషనర్ కరిక్యులంలోని ఫ్యామిలీ అకడమిక్ ప్రోగ్రాం ఎలా అమలు పరుస్తున్నారో తెలుసుకునేందుకు బుధవారం తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఎన్‌ఎంసీ ఎడ్యుకేషన్ బోర్డు సభ్యులు విజయేంద్రకుమార్, కేఎంసీ రీజినల్ సెంటర్ ద్వారా శిక్షణ పొందే 12 మెడికల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎడ్యుకేషన్ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో కాంస్యం

హన్మకొండ: ఇటీవల జోగుళాంబ గద్వాల జిల్లాలో జరిగిన జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలుర క్రికెట్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు క్రీడాకారులను డీవైఎస్‌ఓ జి.అశోక్ గురువారం అభినందించారు. క్రీడాకారులకు నూతన మెళుకువలు నేర్పిస్తూ, ఉన్నత శిక్షణ అందించిన డీఎస్ఏ కోచ్ మహ్మద్ అఫ్జల్, జట్టు మేనేజర్ బండారి ప్రభాకర్, టీం కెప్టెన్ మహ్మద్ ఇబ్రహీంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రటరీ బరుపాటి గోపి, వరంగల్ క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి ఉదయభానురావు అభినందించారు.

గణితశాస్త్ర ప్రావీణ్యులు..




- బోధనలో సులువైన పద్ధతులు
- విద్యార్థుల్లో భయం పోగొట్టి ఆసక్తి పెంచుతున్న ఉపాధ్యాయులు

నేడు జాతీయ గణిత దినోత్సవం

గణితం అంటే చాలామంది విద్యార్థులకు భయం. కానీ అందులోని సూత్రాలు తెలిస్తే అన్ని సబ్జెక్టుకంటే ఎంతో సులువైనదని చెబుతున్నారు గణితబోధకులు. ఉమ్మడి జిల్లాలోని చాలామంది బోధకులు వినూత్న, సులువైన పద్ధతులు రూపొందించి విద్యార్థుల్లో గణితంపై భయాన్ని పోగొట్టి మక్కువ పెంచేలా కృషి చేస్తున్నారు. నేడు (శుక్రవారం) జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గణితంలో కొత్త పద్ధతులు కనిపెట్టి, బోధనాపద్ధతుల్లో ఆరితేరి ఎన్నో అవార్డులు అందుకున్న వారిపై మరిన్ని కథనాలు 8లో..

టీఎల్‌ఎంతో శ్రవణ్‌కుమార్ సులభతర బోధన



డిజిటల్ బోర్డుపై సాలిడ్స్ రూపంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రవణ్‌కుమార్

రాయపర్తి : గణితంలో పట్టు సాధించేలా విద్యార్థులకు సులభతరమైన డిజిటల్ బోధన చేస్తున్నారు మండలంలోని కొండాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పసుల శ్రవణ్‌కుమార్. టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)ను ఉపయోగించి విద్యార్థులను గణితంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. గణిత ప్రయోగశాలలో ఐటిమ్స్‌ను బోధించడం, గణిత ఆకారాలను తయారు చేయించడం వంటి ప్రయోగాలతో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటున్నారు. ఇందుకోసం వేస్ట్ మెటీరియల్, వుడ్, థర్మకోల్ షీట్స్, చార్ట్, పేపర్‌ను ఉపయోగించి మెలకువలు నేర్పిస్తున్నారు. కోణమాని, కంపాస్, వృత్తలేఖిని ఉపయోగించి విద్యార్థులతో తరగతి వైశాల్యాన్ని కొలిపించి శభాష్ అనిపించుకుంటున్నారు. సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్, గణిత, క్విజ్ పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. పదో తరగతిలో గణితంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మెలకువలు నేర్పిస్తున్నారు. పెగడపల్లి పాఠశాలలో పనిచేసినప్పుడు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడులో పనిచేసినప్పుడు సైన్స్‌ఫేర్‌లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డును శ్రవణ్‌కుమార్ అందుకున్నారు.

అనుమతి.. అవినీతి!

ఇంటి నిర్మాణాల్లో చేతివాటం

- లంచమివ్వందే పర్మిషన్ రాదు!
- చైన్‌మెన్లు, ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లే మధ్యవర్తులు
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



సర్కిళ్ల వారీగా గృహ నిర్మాణ అనుమతుల దరఖాస్తులు

	బిల్డింగ్	ప్రాసెస్	పేమెంట్‌దశ దరఖాస్తులు	రిజెక్ట్	అనుమతులు
కాజీపేట	7,909	96	120	1749	5,944
కాశిబుగ్గ	4,924	60	113	1,343	3,408

సాక్షి వరంగల్/వరంగల్ అర్బన్:

సొంతింటి నిర్మాణం పేద మధ్య తరగతి ప్రజల కల. ఆ కల సాకారమవ్వాలంటే డబ్బులు లాగే తిమింగలాలు, జలగలు బోలెడు. వాటన్నింటినీ దాటి నిర్మాణం మొదలు పెట్టాలంటే వేలల్లో డబ్బులు ముట్టజెప్పాల్సిందే. అన్ని రకాల ఫీజులు చెల్లించినప్పటికీ చివరికి అనుమతి ధ్రువీకరణ పత్రాల కోసం భవన నిర్మాణాన్ని బట్టి ఒక్కో దరఖాస్తుకు కనీసం రూ.10వేల నుంచి రూ.30వేలు వసూలు చేస్తున్నారు. లేకపోతే అనుమతి పత్రం చేతికందదు. కొర్రీల పేరుతో 21 రోజుల తర్వాత తిరస్కరించడం గ్రేటర్ వరంగల్‌లో నిత్యకృత్యమైంది.

ఎవరికీ చెప్పుకోలేక..

టీఎస్–బీపాస్ ద్వారా జారీ అవుతున్న భవన నిర్మాణ అనుమతులు దారి తప్పుతున్నాయి. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు, ఉన్నతాధికారులే అనుమతులు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ అవినీతి మాత్రం తగ్గడంలేదు. దరఖాస్తు చేసుకుంటే చాలు.. ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఫీల్డ్ స్థాయి అధికారుల లాగిన్‌కు ఫైల్ చేరుతోంది. వెరిఫికేషన్ కోసం వెళ్తున్నారు. కానీ.. కొద్ది రోజులు ఫైల్‌ను మూసిపెడుతున్నారు. అప్పుడే చైన్‌మెన్ లేదా ప్రైవేట్ సర్వేయర్ ఎంట్రీ ఇస్తున్నారు. ''సర్' ఫైల్ ఒకే చేయడం లేదు. ఖర్చవుతుంది' అని చెబుతున్నారు. ఫీజులు కట్టిన తర్వాత డబ్బులెందుకివ్వాలని ప్రశ్నిస్తే ప్లాన్‌లో పొరపాట్లున్నాయని, రోడ్డుకు స్థలాన్ని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలని, నివాసానికి అనువైన జోన్‌లో స్థలం లేదని, సరైన డాక్యుమెంట్లు లేవని సవాలక్ష కారణాలు చెప్పి తిరస్కరిస్తున్నారు. అడిగినంత ఇస్తే ఏం లేకపోయినా ధ్రువీకరణ పత్రం జారీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అడ్డుకునే వారేరి?

నగరంలో చాలా చోట్ల భవన అనుమతి ధ్రువీకరణ పత్రం లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అన్ని ఫీజులు చెల్లించినప్పటికీ నిబంధనల మేర భవనాలు కట్టుకుంటుంటే లంచాలు ఎందుకివ్వాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతుల దందాపై పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మడికొండకు చెందిన సత్యనారాయణ (పేరు మార్చాం) ప్రైవేట్ ఉద్యోగి. సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనేది ఆయన కల. చేతిలో డబ్బులు లేకపోవడంతో రుణం తీసుకుని నెలవారీగా వాయిదాల పద్ధతిలో చెల్లించాలనుకున్నాడు. రుణం కోసం బ్యాంకు మేనేజర్‌ను కలిశాడు. టీఎస్–బీపాస్‌లో దరఖాస్తు చేస్తే రిజెక్ట్ చేశారు. సర్వేయర్‌ను అడిగితే డబ్బులు చెల్లిస్తేనే పనవుతుందని చెప్పాడు. ఇదేంటని బల్దియా గ్రీవెన్స్ సెల్‌లో కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు.

హంటర్‌రోడ్డుకు చెందిన ఉపాధ్యాయుడు రవికుమార్ నూతన భవన నిర్మాణానికి దరఖాస్తు చేసి పనులు మొదలు పెట్టాడు. అనుమతి లేకుండా ఇల్లు ఎలా కడతారని చైన్‌మెన్ బెదిరింపులకు పాల్పడుతున్నారు. టీఎస్–బీపాస్‌లో పెండింగ్‌లో ఉందని చెప్పినప్పటికీ ససేమిరా అంటూ, నోటీసులు జారీ చేశారు.

బ్యాంకు కాలనీకి చెందిన వ్యాపారి రవీందర్. తన తండ్రి నుంచి వచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. బిల్డింగ్ పర్మిషన్ కోసం కొర్రీలు పెట్టడంతో తిరిగి తిరిగి విసిగిపోయాడు. అనుమతి లేకుండానే నిర్మాణం సాగిస్తున్నాడు.

పైన పేర్కొన్న ఉదాహరణలు మచ్చుకు కొన్ని మాత్రమే. నగర పరిధిలో ఇల్లు కట్టుకోవాలనుకునే వారంతా ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కేయూలో ర్యాగింగ్ భూతం

- ర్యాగింగ్‌కు పాల్పడిన 28 మంది కామర్స్ విద్యార్థినుల సస్పెన్షన్
- తాజాగా జువాలజీ విభాగంలో వెలుగులోకి
- ఆ విభాగం సీనియర్ విద్యార్థినులపైనా వేటు
- యాంటీ ర్యాగింగ్ కమిటీల ఏర్పాటు ఏదీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా హాస్టల్‌లో ర్యాగింగ్ కొద్దిరోజులుగా చాపకింది నీరులా సాగుతోంది. కామర్స్ విభాగంలో జరిగిన ర్యాగింగ్ ఘటనపై విచారణ సాగుతుండగానే జువాలజీ విభాగంలోనూ సీనియర్లు.. జూనియర్లను వేధించినట్లు గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 18న కామర్స్ విభాగం సీనియర్ విద్యార్థినులు హాస్టల్‌లో జూనియర్లను ర్యాగింగ్ చేసినట్లు ఓ బాధిత విద్యార్థిని బయటికి చెప్పడంతో విచారణ జరిపిన ప్రొఫెసర్ల బృందం రిజిస్ట్రార్‌కు శ్రీనివాస్‌రావుకు నివేదిక సమర్పించింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం 28 మంది సీనియర్ విద్యార్థినులను వారంరోజులపాటు హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. ఆయా విద్యార్థినులకు సమాచారం కూడా ఇచ్చామని హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు.

జువాలజీ సీనియర్ విద్యార్థినులు 25 మందికి పైగానే

మహిళా హాస్టల్‌లోని జువాలజీ విభాగం సీనియర్లు.. జూనియర్లను ర్యాగింగ్ చేసినట్లు తాజాగా ఆ విభాగం అధిపతి దృష్టికి వెళ్లింది. క్యాంపస్‌లోని ఆడిటోరియం వద్దకు ఇటీవల జూనియర్లను రప్పించి పరిచయం పేరిట ర్యాగింగ్ చేశారని ఆరోపణలున్నాయి. బాధిత విద్యార్థినులు 30 మందివరకు ఉంటారని తెలుస్తోంది. కామర్స్ విభాగం ఘటన వెలుగులోకి రావడంతో జువాలజీ జూనియర్లు తమను వేధించిన విషయాన్ని గురువారం ఆ విభాగం అధిపతి ప్రొఫెసర్ జి.షమిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీనియర్లు, జూనియర్లను ప్రొఫెసర్ వై.వెంకయ్య, ఇతర అధ్యాపకుల సమక్షంలో విచారణ జరిపారు. తమను రైలులో పల్లీలు ఎలా అమ్ముతారో చూపాలని, పాటలు పాడాలని ర్యాగింగ్ చేశారని జూనియర్లు తెలిపినట్లు సమాచారం. కాగా, తాము ఫ్రెండ్లీగా వ్యవహరించామని, ర్యాగింగ్‌కు పాల్పడలేదని సీనియర్లు చెప్పినట్లు తెలిసింది. విచారణ అనంతరం విషయాన్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 25మందికిపైగానే సీనియర్లు ఉంటారని, వారిని హాస్టల్ నుంచి వారంరోజులపాటు సస్పెండ్ చేసినట్లు హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్య తెలిపారు. మరో విభాగానికి చెందిన సీనియర్లు కూడా జూనియర్లను ర్యాగింగ్ చేసినట్లు ప్రాథమికంగా కేయూ హాస్టళ్ల డైరెక్టర్ దృష్టికి వచ్చిందని, వారిపైనా చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

పత్తా లేని యాంటీ ర్యాగింగ్ కమిటీలు

యూనివర్సిటీలో రెండు మూడేళ్లుగా యాంటీ ర్యాగింగ్ కమిటీలను నియమించడం లేదు. గతంలో యూనివర్సిటీలోని పలు కాలేజీలతోపాటు విభాగాల వారీగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఉండేవి. ఈ కమిటీలు విస్తృతంగా ప్రచారం చేసేవి. ఇప్పుడు ఎటువంటి కమిటీలు లేకపోవడంతో సీనియర్లలో భయం లేకుండా పోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా మహిళా హాస్టల్‌లో ర్యాగింగ్ కొద్దిరోజులుగా జరుగుతుండగా నేది ఒక్కో విభాగం జూనియర్లు బయటికి చెబుతున్న పరిస్థితి నెలకొంది.

ప్రీ క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్

వరంగల్ అర్బన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధి ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు వేడుకల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ చర్చిల పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రీ క్రిస్మస్ వేడుకల నోడల్ అధికారి/డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 23న ప్రీ క్రిస్మస్ వేడుకలు (ఫీస్ట్) నిర్వహించనున్నట్లు, ఇందుకోసం క్రిస్మస్ సెలబ్రేషన్ ఆర్గనైజింగ్ కమిటీ (సీసీఓసీ) ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు, పేద క్రిస్టియన్లకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించిందని కమిటీ సూచనలతో వేడుకలు ఘనంగా నిర్వహించి, భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ తహసీల్దార్ మాట్లాడుతూ.. సుమారు వెయ్యి మందికి బహుమతులు పంపిణీ చేయాలని భావించినప్పటికీ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు అదనంగా మరో 2 వేల మందికి బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వర్ధన్నపేట: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్‌జీఓలు ముందు వరుసలో ఉంటారని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ అన్నారు. వర్ధన్నపేటలో టీఎన్జీఓస్ మండల శాఖ గురువారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదట నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని సూచించారు. జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ టీఎన్జీఓస్ సంఘం 75 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో ఉన్నామని గుర్తు చేశారు. సంఘంలో ప్రతి ఉద్యోగి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు గద్దల రాజు, దుర్గారావు, నాయకులు శెంకేసి రాజేష్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రఘు, కార్యదర్శి సదానందం, యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, రవికుమార్, విజేందర్, శరత్, అఖిల్ ప్రియ, అమరావతి, మత్యాస్‌రెడ్డి, సాయిరాం, శ్రీనివాస్, అనిల్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఈబీ సెక్రటరీగా రాంధన్

విద్యారణ్యపురి: హనుమకొండ డీఈఓ కార్యాలయంలోని జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ) సెక్రటరీగా నారాయణగిరి పీజీహెచ్‌ఎం డాక్టర్ బి.రాంధన్ నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఉత్తర్వులు జారీ చేశారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

కాళోజీ సెంటర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ రెన్యూవల్/ఫ్రెష్ కోసం ఈనెల 31 లోగా http:// telanganaepass.cgg.inలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెన్యూవల్ కోసం తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, గత సంవత్సరం మెమో, బ్యాంకు ఖాతా నంబర్, ఫోన్ నంబర్, స్టడీ సర్టిఫికెట్లు జత చేయాలని పేర్కొన్నారు. ఫ్రెష్ దరఖాస్తులకు పదో తరగతి మెమో, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, సీట్ అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీ, స్టడీ సర్టిఫికెట్లు జతపరచాలని సూచించారు.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా నంబర్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, మొబైల్ నంబర్‌తో www. telanganaepass.cgg. gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- డీఆర్డీఓ మట్టపల్లి సంపత్‌రావు
- డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్డీఓ సంపత్‌రావు



పాల్గొన్న డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు

వరంగల్: గ్రామీణాభివృద్ధి శాఖలో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మట్టపల్లి సంపత్‌రావు అన్నారు. డీఆర్డీఏ కార్యాలయంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో సెర్ప్ విభాగాలపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 30 వరకు నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తిచేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామైక్య సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా పీఎం ఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రుణాలు అందించి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల పనితీరు, గ్రేడింగ్ అంశాలపై క్షుణ్ణంగా చర్చించి సూచనలు, సలహాలు అందించారు. జిల్లాలోని సంఘాలు ఏ, బీ గ్రేడ్లలో మాత్రమే ఉండేలా సిబ్బంది, వీఓఏలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. 9,430 సంఘాలకు రూ.426 కోట్లు బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు ఇప్పించాల్సి ఉందని పేర్కొన్నారు. 4,576 సంఘాలకు రూ.352 కోట్లు బ్యాంకు లింకేజీ అందించి 83 శాతం మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన 17 శాతం ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. రుణాలు ఇప్పించడం ఎంత ముఖ్యమో తిరిగి సభ్యుల నుంచి నెలనెలా క్రమం తప్పకుండా చెల్లింపులు చేయించడం కూడా అంతే ముఖ్యమని, ఎన్‌పీఏ రికవరీకి ప్రతి శుక్రవారం మండలస్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో తిరస్కరించిన డీపీఆర్‌లను మళ్లీ కొత్తగా రూపొందించి బ్యాంకులకు పంపించి రుణాలు మంజూరయ్యేటట్లు చూడాలన్నారు. మార్కెటింగ్ కేంద్రాల్లో అమ్మిన సరుకులను ట్రక్‌షీట్ ప్రకారం ఓపీఎంఎస్‌లో నమోదు చేసి రైతులకు తగిన సమయానికి డబ్బులు అందేవిధంగా చూడాలని వివరించారు. ఎస్‌వీఈపీ లోన్ తీసుకున్న ప్రతి సభ్యురాలు 100 శాతం రీపేమెంట్ చేసి ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూడాలని పేర్కొన్నారు. రవాణా సౌకర్యం లేని గ్రామాలకు ఏజీఈవై పథకంలో ప్రతి మండలం నుంచి రెండు ఆటోలను కొనుగోలు చేసుకోవడానికి లబ్ధిదారులను గుర్తించి జిల్లా కార్యాలయానికి పంపాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జిల్లా కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను సిబ్బంది, అధికారులు కలిసి వైభవంగా నిర్వహించారు. అడిషనల్ డీఆర్డీఓ గొట్టె శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన సిబ్బంది, జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

24న ఎస్‌ఆర్ సాట్ 'క్యూ' స్కాలర్‌షిప్ టెస్ట్

విద్యారణ్యపురి: ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 24న నగరంలోని వడ్డేపల్లిలోని ఎస్‌ఆర్ ఎడ్యూ సెంటర్‌లో ప్రైవేట్ లిమిటెడ్ సాట్ 'క్యూ' (ఎస్‌ఆర్ అకడమిక్ టాలెంట్ 'క్వెస్ట్') ఫ్రీ స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు 100 శాతం స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందని, సాట్ 'క్యూ' రాసిన ప్రతీ విద్యార్థి స్కాలర్ షిప్ పొందొచ్చని తెలిపారు. 2024–2025 విద్యాసంవత్సరంలో జేఈఈ అడ్వాన్స్ /మెయిన్స్, నీట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నీట్‌లో 50 సంవత్సరాల అనుభవం కలిగిన ఎస్‌ఎడ్యూ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సాట్ క్యూ ఎస్‌ఆర్ అకడమిక్ టాలెంట్ ఆఫ్ స్కాలర్‌షిప్ టెస్టును ఈనెల 24న వడ్డేపల్లి ఎస్‌ఆర్‌ఎడ్యూసెంటర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9642117830, 9642117330 నంబర్లకు ఫోన్ చేసి వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఎంసెట్, ఐఐటీ, నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు.

తల్లికి కూతురును అప్పగించిన 'సఖి'

కాజీపేట అర్బన్: పెళ్లి నచ్చక ఇంటి నుంచి వెళ్లిపోయిన మహబూబాబాద్‌కు చెందిన కూతురును సఖి సిబ్బంది గురువారం తల్లికి చెంతకు చేర్చింది. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి కథనం ప్రకారం.. హనుమకొండ నయీంనగర్‌లోని లక్ష్మీనర్సింహ ఆసుపత్రి ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి ఓ మహిళ ఒంటరిగా ఉన్నట్లు ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే సఖి సిబ్బందితో పాటు హనుమకొండ పోలీసులు ఒంటరిగా ఉన్న మహిళను సెంటర్‌కు తీసుకుని వచ్చి తాత్కాలిక వసతి కల్పించారు. మంగళవారం మహిళకు కౌన్సెలింగ్ నిర్వహించగా తన తల్లి కొద్దిరోజుల క్రితం తనకు ఇష్టం లేని పెళ్లి చేసిందని, దీంతో మన స్తాపానికి గురైన తను కొద్ది రోజులు చిన్నమ్మ ఇంట్లో ఉన్నానని తెలిపింది. తన స్నేహితురాలు ఇంటికి పిలవడంతో సోమవారం హనుమకొండ వచ్చి ఫోన్ చేయగా తాను అందుబాటులో లేనని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో లక్ష్మీనరసింహ ఆసుపత్రి వద్ద ఉన్నానని తెలిపింది. ఈ నేపథ్యంలో వివరాలు తెలుసుకుని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో తల్లికి కూతురును అప్పగించామని హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా యువతి తల్లి.. సఖి వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


కుల్సుం (ఫైల్)

కాజీపేట: అత్తింటి వేధింపులకు తాళలేక ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ సార్ల రాజు కథనం ప్రకారం.. కాజీపేట పట్టణానికి చెందిన ఓమైకుల్సుం (30)కు 2017లో ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ యాకుబ్ పాషాతో వివాహం జరిగింది. దంపతులకు కూతురు రిహానా మీర్జా ఉంది. ఈ క్రమంలో కొంత కాలంగా అత్త ఫాతిమా, మామ సందేసాహేబ్, భర్త షేక్ యాకుబ్ పాషా.. కుల్సుంను వేధింపులకు గురి చేస్తున్నారు. రూ. 30 లక్షలు వెచ్చించి నూతన ఇల్లు కొనివ్వాలని, మృతురాలి తండ్రి ఉద్యోగం కావాలని వేధిస్తున్నారు. దీంతో వీరి వేధింపులు భరించలేక కుల్సుం.. ఇటీవల భర్తను వదిలేసి తల్లిగారింటికి వచ్చింది. అయితే ఈ ఘటనపై మనస్తాపం చెంది గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి జహీరా బేగం ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



సమస్యల సాధనకు భయం లేకుండా...


నమూనాతో లెక్కల పాఠం బోధిస్తున్న మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ రమేష్

వరంగల్ జిల్లా నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బండారి రమేష్.. గణితంలో సమస్యల సాధనకు భయం లేకుండా బోధిస్తున్నారు. విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ, సూత్రాలు ప్రయోగాత్మకంగా రాబడుతూ, ఆ సూత్రాలను సమస్యల సాధనలో ఉపయోగిస్తూ అభ్యసన ప్రక్రియను కొనసాగిస్తుండడం విశేషం. కాగా, రమేష్ ఇప్పటి వరకు గణిత నమూనాల ప్రదర్శనలో 8సార్లు, ఉపాధ్యాయ విభాగంలో 8 సార్లు, విద్యార్థుల విభాగంలో దక్షిణ భారతదేశ స్థాయిలో రెండుసార్లు, విద్యార్థుల విభాగంలో జాతీయస్థాయిలో పాల్గొని అధికారుల ప్రశంసలు పొందారు. 2012లో దక్షిణ భారతదేశ స్థాయిలో, 2012లో రాష్ట్ర స్థాయిలో, 2018లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

సులువుగా, సులభంగా..


విద్యార్థికి బోధిస్తున్న టీచర్ సుమన్ బాబు

హనుమకొండ జిల్లాలోని వేలేరు మండలం మద్దెర్ల గూడెం పీఎస్ ఉపాధ్యాయడు సుమన్‌బాబు కట్కం వినూత్నంగా విద్యాబోధన చేపడుతున్నారు. విద్యార్థులకు గణిత శాస్త్రంలో ప్రాథమిక దశ చాలా ముఖ్యం. అందుకే సంఖ్యా భావన, స్థాన విలువలు, చతుర్విద ప్రక్రియల ద్వారా బోధిస్తున్నారు. వీటిలో సంఖ్యా భావన, చిట్టీల ఆట, కృత్యాధార, చతుర్విద ప్రక్రియలు, 0 టు 10 ఫ్లాష్ కార్డులు ఉపయోగించి విద్యార్థులకు సులభంగా పాఠాలు చెబుతున్నారు. అలాగే, స్థాన విలువలు, ఫ్యాషన్ షో, కృత్యం ద్వారా ఇష్టంగా నేర్చుకుంటారు. దీనిలో పిల్లల తలలకు 0 నుంచి 9 వరకు అంకెల క్యాప్‌లు పెట్టాలి. బ్లాక్ బోర్డు పై వందలు, పదులు, ఒకట్లు అని రాస్తే , పిల్లలు ఆయా స్థానాల్లో ఫ్యాషన్ షో లా తిరుగుతూ స్థాన విలువలు అర్థం చేసుకుంటారు.

కృత్యాలతో విద్యా బోధన



గణితంలో ఒక అంశాన్ని విద్యార్థుల మనసుల్లో వేగంగా చేరేలా, వారి మెదడులో సుస్థిరంగా ఉండాలంటే వారికి వివిధ కృత్యాల ద్వారా విద్యా బోధన చేపట్టాలి. సరిగా అలాగే విద్యాబోధన చేపడుతున్నారు లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వనం శ్రీవాణి. 'విద్యార్థిలో సజనాత్మక ఆలోచనలు బయటకు వచ్చేలా బోధిస్తే వారిలో నైపుణ్యం, సామర్థ్యం పెంపొందుతుంది. విద్యార్థి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ప్రాథమికంగా గణిత శాస్త్రం కీలకపాత్ర పోషిస్తుంది. విద్యార్థి సమగ్రతకు అవసరమైన నైపుణ్యాలు ద్వారా దేశం, ప్రపంచం అభివృద్ధికి దోహదపడుతుంది.'

గణితశాస్త్ర ప్రావీణ్యులు..

సులువుగా బోధిస్తున్న ఉపాధ్యాయులు

- నమూనాల ప్రదర్శన, కంప్యూటర్, తదితర విధానాలతో టీచింగ్
- సులభంగా అర్థం చేసుకుంటున్న విద్యార్థులు
- నేడు జాతీయ గణిత దినోత్సవం

గణితం.. మానవుడి దైనందిన జీవితంతో వీడదీయరాని అనుబంధం కలిగిన శాస్త్రం. ఉదయం లేచింది మొదలు.. రాత్రి నిద్రించే వరకు మానవ జీవితం ఈ శాస్త్రం చుట్టే తిరుగుతుంది. ఈ రోజు ఎంత ఆదాయం లభించింది..? ఎంత ఖర్చు అయింది..? ఏ వస్తువుకు ఎంత డబ్బు కేటాయించాం అనే విషయాలు గణితశాస్త్రం ద్వారానే తెలుసుంది. అయితే లెక్కలంటే చాలా మంది విద్యార్థులకు భయం ఉంటుంది. కానీ వారికి అర్థమయ్యేలా బోధిస్తే లెక్కలంత సులభ సబ్జెక్టు మరొకటి లేదు. ఈ నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయులు.. విద్యార్థులకు సులువుగా, సులభంగా అర్థమయ్యేలా గణితశాస్త్రం బోధిస్తున్నారు. అలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బోధిస్తున్న పలువురి ఉపాధ్యాయులపై శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా (గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినం) 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

– విద్యారణ్యపురి/నెక్కొండ/వరంగల్ చౌరస్తా/తొర్రూరు/ మహబూబాబాద్ అర్బన్/లింగాలఘణపురం/జఫర్‌గఢ్

చార్టులతో వివరణ..

లెక్కలంటే భయపడే పిల్లలే ఎక్కువ. కానీ వారి అర్థమయ్యేలా బోధిస్తే లెక్కలంత సులభ సబ్జెక్టు మరొకటి లేదు. దీనిని నిరూపిస్తోంది మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు ఎస్. సంధ్య. గణితంలో ఎంత కఠిన అంశానైనా తేలిగ్గా, మనసులో నాటుకుపోయేలా బోధిస్తూ విద్యార్థులకు సబ్జెక్టుపై మక్కువ పెంచుతున్నారు. గణితంలోని ప్రాథమిక అంశాలు, బీజ గణితం, రేఖా గణితంతో పాటు పలు ఫార్ములాలను ఛార్టులుగా తయారు చేసి విద్యార్థులకు వివరిస్తున్నారు. గణితంతో గారడీలు, గణిత విన్యాసాలు, గణిత వైకుంఠపాళి, అంకెలతో ఆటలు, గణిత చిట్కాలు తయారు చేస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు.


గణితం చార్టుతో విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయురాలు సంధ్య



గణితంపై భయం లేకుండా ..

లింగాలఘణపురం మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు నిమ్మ వాసుదేవరెడ్డి బోధనలో మేటిగా నిలుస్తున్నారు. గణితంలోని అంశాలు అమూర్త భావనలు అనగా మూర్త వస్తువులతో బోధించడంతో విద్యార్థులు గణిత శాస్త్రంపై భయం లేకుండా విద్యనభ్యసిస్తున్నారు. వస్తువుల రూపంలో ప్రయోగాత్మకంగా చేయిస్తున్నారు. ' తరగతి గదిలోని నేలపై ఉన్న షాబాద్ బండ పొడవు, వెడల్పు కొలిచి వైశాల్యం చేసి చూపిస్తే విద్యార్థులు మరిచిపోరు. ఈ విధంగా బోధన చేయడం వల్ల విద్యార్థికి సులువుగా అర్థమవుతుంది'. కాగా, వాసుదేవరెడ్డి కరోనా సమయంలో డిజిటల్ పాఠాల ప్రజెంటేషన్‌లో సంధానకర్తగా పని చేశారు.

ప్రయోగాల్లో దిట్ట..

జఫర్‌గఢ్ మండలం కునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పెనుమాటి వెంకటేశ్వర్లు ప్రయోగాల్లో దిట్ట. విద్యార్థులకు నిరంతరం గణిత టాలెంట్ పరీక్షలు, మేళా, క్విజ్‌లు నిర్వహిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ సులభ సూత్రాలతో గణితంలో ప్రావీణ్యులుగా తయారు చేస్తున్నారు. దీంతో ఈ పాఠశాల విద్యార్థులు ఏటా జరిగే గణిత దినోత్సవం రోజుతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే టాలెంట్ టెస్టుల్లో ఉత్తమంగా నిలుస్తున్నారు.


విద్యార్థులకు బోధిస్తున్న టీచర్ వెంకటేశ్వర్లు

క్రియేటివ్ థికింగ్‌తో..



క్రియేటివ్ థింకింగ్, ఇన్నోవేషన్‌తో విద్యార్థులు తరగతి గదుల్లో విషయాలపై ఆసక్తికనబర్చాలి. ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలు అడగాలి. అప్పుడే విద్యార్థిలో నిగూఢంగా ఉన్న ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుంది. సరిగా ఇదే ఫార్ములను అనుసరిస్తున్నారు చౌర్‌బౌళి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పాగు అశోక్. క్రియేటివ్ థింకింగ్, ఇన్నోవేషన్‌తో విద్యాబోధన చేపడుతూ విద్యార్థుల్లో ఉన్న అంతర్లీనంగా ఉన్న సజనాత్మకతను వెలికితీస్తున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా..



ప్రస్తుత కాలంలో గణితం పట్ల ఆసక్తి పెంచడానికి 'జియోజీబ్రా' అనే కంప్యూటర్ సాధన పద్ధతి ఉపయోగపడుతుంది. దీని ద్వారా బోధించడం వల్ల విద్యార్థులు సులువుగా నేర్చుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ముదిగిరి సదయ్య అదే పద్ధతిలో విద్యార్థులకు విద్యాబోధన చేపడుతున్నారు. అలాగే, గూగుల్ ఫామ్ ద్వారా క్విజ్, జవాబుల మూల్యాంకనం, ఆన్‌లైన్ పాఠాలు తయారు చేసి జిల్లాలోని విద్యార్థుల కోసం 'మహబూబాబాద్ ఎడ్యుకేషన్' అనే యూట్యూబ్ చానల్ ద్వారా బోధిస్తున్నారు. కోవిడ్ సమయంలో క్లాసులు బోధించారు. పాఠశాలల్లో ఎల్‌ఎఫ్‌పీ పానల్ ఉపయోగించి ప్రతి కాన్సెప్ట్ దృశ్య రూపంలో వివరిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరగడంతో పాటు చురుకుగా బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొంటున్నారు.

శిలాఫలకం ఎందుకు తొలగించారు

- భూములు కొనుగోలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయా?
- కబ్జాదారులపై తహసీల్దార్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్


కబ్జాకు గురైన చేపల ఉత్పత్తి కేంద్రం స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారులు సీరియస్ అయ్యారు. 'చేపల ఉత్పత్తి కేంద్రం స్థలం కబ్జా' అనే శీర్షికతో 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి తహసీల్దార్ చల్లా ప్రసాద్ స్పందించారు. చేపల ఉత్పత్తి కేంద్రం స్థలం, అంగడీ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భూమి చదును చేస్తున్న వారితో మాట్లాడారు. ఎవరి అనుమతి తీసుకుని చేపల ఉత్పత్తి కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం, నిరుపయోగంగా ఉన్న భవనం తొలగించారని ప్రశ్నించారు. భూములు కొనుగోలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆధారాలుంటే రెండురోజుల్లో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, భీమారంలోని శ్యామల చెరువు కబ్జాపై తహసీల్దార్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి నివేదిక అందించాలని సర్వేయర్ ఎర్రబెగడను ఆదేశించారు. కాగా, శ్యామల చెరువుతో పాటు పుట్టలమ్మ చెరువు కూడా కబ్జాకు గురైందని స్థానికులు ఆకుల కుమార్, రమేష్..తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

పూర్తి స్థాయిలో దర్యాప్తు..


ఎల్లాపురంలోని చేపల ఉత్పత్తి కేంద్రం, అంగడీ స్థలంతో పాటు భీమారం శ్యామల చెరువు కబ్జాపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తహసీల్దార్ చల్లా ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సర్కార్ స్థలాలు కబ్జాకు గురైనట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సాంకేతిక విద్యతో ఉన్నత స్థాయికి..

- ఎస్‌ఆర్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.రాజేష్
- ఘన్‌పూర్ పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్‌ఫెస్ట్–23


స్టేషన్‌ఘన్‌పూర్: లైన్‌సిటీ మోడల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ పోచయ్య, అతిథులు

స్టేషన్‌ఘన్‌పూర్: సాంకేతిక విద్య ద్వారా భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎస్‌ఆర్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.రాజేష్, గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ డీఈ అనిల్ యాదవ్ అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల సృజన ఫెస్ట్–2023 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, జీపీటీ వరంగల్, జీపీటీ(డబ్ల్యూ) వరంగల్, జీపీటీ చేర్యాల కళాశాల సివిల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వరంగల్ జీపీటీ 96 పాయింట్లతో ప్రథమ స్థానం, జీపీటీ చేర్యాల 94 పాయింట్లతో రెండవ స్థానం, జీపీటీ(డబ్ల్యూ) వరంగల్ 93.5 పాయింట్లతో మూడో స్థానం, స్టేషన్‌ఘన్‌పూర్ జీపీటీ 87.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాయి. అతిథులు ప్రొఫెసర్ రాజేష్, అనిల్‌యాదవ్ వాటిని పరిశీలించి ప్రదర్శన ఆధారంగా పాయింట్లు వేసి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సాంకేతిక విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, పాలిటెక్నిక్ ద్వారా ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఏ రంగంలోనైనా ప్రణాళిక, పట్టుదల ప్రధానమని, ముందస్తుగా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుని అధ్యాపకులు, పేరెంట్స్ సూచనల మేరకు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ జీపీటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పోచయ్య, ప్రోగ్రాం ఇన్‌చార్జ్, సివిల్ హెడ్ కె.నవీన్‌కుమార్, ఎలక్ట్రికల్ హెడ్ బీవీవీఎస్ రామకృష్ణ, జనరల్ హెడ్ ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


రామన్నపేట : తమ పరిశోధలను ప్రదర్శిస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

సృజనాత్మకతను వెలికితీయడానికే టెక్‌ఫెస్ట్

రామన్నపేట : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికే సృజన టెక్‌ఫెస్ట్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. గురువారం వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల మెకానికల్, కంప్యూటర్‌సైన్స్‌కు చెందిన విద్యార్థులు సృజన టెక్ ఫెస్ట్‌లో పాల్గొని వివిధ అంశాల్లో తమ పరిశోధనలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఎంజీఎంలో పాజిటివ్ రాలేదు

- సోషల్ మీడియా కథనాలు అవాస్తవం
- ఆరుగురు అనుమానితుల శాంపిళ్లు సేకరించాం
- సూపరింటెండెంట్ చంద్రశేఖర్


చంద్రశేఖర్

ఎంజీఎం: ఎంజీఎంలో కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదని ఎంజీఎం సూపరిండెంట్ చంద్రశేఖర్ అన్నారు. ఎంజీఎంలో నలుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై ఆయన స్పందించారు. ఆస్పత్రిలో అనుమానితులుగా పేర్కొంటున్న ఐదుగురు ఇన్‌పేషెంట్లు, ఒక ఓపీ రోగి నుంచి శాంపిళ్లు సేకరించి ఆర్టీపీసీఆర్ నిర్ధారణ పరీక్షల కోసం కేఎంసీలోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు శాంపిళ్లు పంపించినట్లు సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

ప్రైవేట్ ల్యాబ్‌లో పాజిటివ్!

భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలం గాంధీనగర్‌కు చెందిన వృద్ధురాలు శ్వాసకోస సమస్యలతో బాధపడుతూ.. నాలుగు రోజులుగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని, ఈక్రమంలో ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా.. పాజిటివ్ వచ్చినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ తెలిపారు. బుధవారం రాత్రి ఆమె ఎంజీఎంలో అడ్మిట్ అయిందని, సదరు మహిళ తీవ్ర అస్వస్థతతో ఇబ్బందులు పడుతుండగా.. ప్రత్యేకంగా ఎంజీఎంలో సారీ (శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులకు ఏర్పాటు చేసే వార్డు)లో ఆమెను అడ్మిట్ చేసి ఆక్సిజన్ ద్వారా చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా.. ఆర్టీపీసీఆర్ పరీక్షల నిర్ధారణ కోసం ఆమె శాంపిళ్లు సేకరించి కేఎంసీ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో అనుమానాస్పదంగా జలుబు, జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఐదుగురి నుంచి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఆరుగురికి నిర్ధారణ పరీక్షలు శుక్రవారం మధ్యాహ్నం నివేదికలు అందిన తర్వాత చికిత్స అందిస్తామన్నారు.

జీనోమ్‌స్వీకెన్సీ పరీక్షలకు పంపుతాం..

ఎవరికైనా పాజిటివ్‌గా నిర్ధారణ అయితే కొత్త వెరియంట్ జేఎన్–01 వైరస్ నిర్ధారణ కోసం శాంపిళ్లను జీనోసీక్వెన్సీ ల్యాబ్‌కు పంపిస్తామని సూపరిండెంట్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతానికి కరోనా రోగుల కోసం 50 పడకలు సిద్ధం చేశామని, 1200 ఆక్సిజన్ పడకలు అందుబాటులోకి తెచ్చేలా అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. రెండు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు, 70 వెంటిలైటర్లు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

9.5 కిలోల గంజాయి పట్టివేత


ధర్మారంలో పట్టుకున్న గంజాయిని తూకం వేయిస్తున్న పోలీసులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం రైల్వేగేట్ సమీపంలో రూ.2,37,000 విలువైన 9.5 కిలోల ఎండు గజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ అధికారుల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, గీసుకొండ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని కోర్ధ జిల్లాకు చెందిన కృష్ణ చంద్రప్రధాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. అతడి వద్ద గంజాయి లభించిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.దేవేందర్, గీసుకొండ ఎస్సై వెంకన్న, టాస్క్‌ఫోర్స్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా జోనల్ క్రీడలు

- దుమ్ములేపుతున్న గిరిజన క్రీడాకారులు
- పలువురికి బహుమతుల ప్రదానం


వాలీబాల్‌లో తలపడుతున్న వరంగల్, మహబూబాబాద్ క్రీడాకారులు

ఏటూరునాగారం: ఐటీడీఏ జోనల్ క్రీడల్లో గిరిజన క్రీడాకారులు దుమ్ములేపుతున్నారు. హోరాహోరీగా జరుగుతున్న పోటీల్లో నువ్వా? నేనా అంటూ తలపడుతున్నారు. ఏటూరునాగారంలోని కొమరం భీం స్టేడియంలో బుధవారం ప్రారంభమైన ఐటీడీఏ జోనల్ క్రీడలు గురువారం రెండో రోజుకు చేరాయి. శుక్రవారం ఫైనల్స్ జరగనున్న నేపథ్యంలో ఇప్పటి వరకు గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. అండర్ –17 బాలుర విభాగంలో ఏటూరునాగారం జట్టు ప్రథమ స్థానం, కొత్తగూడ రెండో స్థానంలో నిలిచింది. అలాగే, అథ్లెటిక్స్‌లో –17 విభాగంలో 3వేల మీటర్ల పందెంలో రవీందర్(ఏటూరునాగారం) ప్రథమ స్థానంలో, కొత్తగూడకు చెందిన సాయిసుప్రతి రెండో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో ముత్యాలమ్మగూడేనికి చెందిన సుస్మిత మొదటి స్థానంలో కురవికి చెందిన స్వప్న రెండో స్థానంలో నిలిచారు. 800 మీటర్లలో బాలుర విభాగంలో కొత్తగూడకు చెందిన విశ్వతేజ మొదటి స్థానంలో , హనుమకొండకు చెందిన రాజు రెండో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో కొత్తగూడ కు చెందిన హారిక మొదటి స్థానంలో , తాడ్వాయికి చాందిని రెండో స్థానంలో నిలిచారు. 600 మీటర్లలో బాలుర విభాగంలో కొత్తగూడకు చెందిన చరణ్ మొదటి స్థానంలో, సీతానగర్‌కు చెందిన సిద్ధు రెండో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో లోహిత మొదటి స్థానంలో, హరిని రెండో స్థానంలో నిలిచారు. లాంగ్‌జంప్‌లో పేరూరుకు చెందిన వైష్ణవి మొదటి స్థానంలో, ఏటూరునాగారానికి చెందిన చాంది రెండో స్థానంలో నిలిచారు. బాలురలో కొత్తగూడకు చెందిన గంగచరణ్ మొదటి స్థానంలో, కొత్తగూడకు చెందిన శివగణేష్ రెండో స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగతంగా గెలుపొందిన వారికి ఏటీడీఓలు దేశిరాం, క్రాంతికుమార్, ఏసీఎంఓ రవీందర్, ఏఓ పరశురాం పతకాలు అందజేశారు.

వరంగల్ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

వరంగల్ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ వారాంతపు యార్డు బంద్, 24 వారాంతపు సెలవు, 25 క్రిస్మస్, 26 బాక్సింగ్ డే సందర్భంగా బంద్ ఉంటుందని పేర్కొన్నారు. 23న జిన్నింగ్‌లో మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, దడువాయిలు, హమాలీ కార్మికులు గమనించాలని మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్ కోరారు.